క్లుప్తంగా

గుండ్రటి కరెన్సీ నోటు సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన గుండ్రటి ఆకృతి కరెన్సీ నోటు

అమలాపురం టౌన్: ప్రపంచంలోని ఏ దేశమైనా సాధారణంగా కరెన్సీ నోట్లను దీర్ఘ చతురస్రం గానే ముద్రించి విడుదల చేస్తుంటాయి. అయితే ఫ్రాన్స్ దేశం తొలిసారిగా 1915లో నాణేలను పోలే విధంగా 10 సెంటైమ్స్ కరెన్సీ నోటును గుండ్రని ఆకృతితో ఉండేలా ముద్రించింది. అరుదైన ఈ కరెన్సీ నోటును అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన కరెన్సీ నోట్ల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆసుపత్రిలో పింఛన్‌దారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గాభవాని

కాట్రేనికోన: కాట్రేనికోన మండలం గచ్చకాయలపోరకు చెందిన పింఛన్‌దారుడు ఓలేటి నాగేశ్వరరావు కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్స చేయించుకుని ఐసీయూలో ఉన్నాడు. దీంతో వలంటీర్ దుర్గాభవాని కాకినాడలోని సదరు ఆసుపత్రికి వెళ్లి నాగేశ్వరరావుకు పింఛన్ సొమ్ము అందజేసింది.

యానాంలో సీబీఎస్ఈ సిలబస్ అమలు

యానాం: 2023–24 విద్యా సంవత్సరం నుంచి యానాం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ హైస్కూల్స్‌లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6, 9, 11 తరగతులకు సీబీఎస్ఈ అమలు చేస్తామని 10, 12 తరగతులకు స్టేట్ బోర్డు సిలబస్ అమలులో ఉంటుందన్నారు. సీబీఎస్ఈ సిలబస్ తదితర కరిక్యులర్ అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులను ఈ నెలలోనే నిర్వహిస్తామన్నారు.

అవార్డు రావడం అభినందనీయం



పేరూరు సర్పంచ్ దాసరి అరుణను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: జిల్లా స్థాయిలో స్నేహపూర్వక ఉత్తమ పంచాయతీ అవార్డు పేరూరు సర్పంచ్ దాసరి అరుణ అందుకోవడం అభినందనీయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న సందర్భంగా శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన అభినందన సభకు మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ అరుణ, డేవిడ్ దంపతులను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, ఎంపీడీవో కాశీ విజయ ప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవింద్‌శెట్టి, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వేట నిషేధ సాయం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు ప్రభుత్వం అందించే వేట నిషేధ సాయం రూ.6,500 చొప్పున త్వరలోనే వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తామని మత్స్య శాఖ ఏడీ దడాల గొంతియ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ వేట నిషేధం అమల్లో ఉన్న నేపథ్యంలో రేషన్‌కార్డు కలిగిన ప్రతి మత్స్యకార లబ్ధిదారుడికి సొమ్ము జమ అవుతుందన్నారు. ఆధార్ కార్డు నెంబర్లు సరిపోలని కారణంగా 268 మందికి సాయాన్ని నిలిపేస్తున్నట్లు ఇప్పటికే ఆర్ఏఓ మునిస్వామి తెలియజేశారన్నారు.

వచ్చే నెల 4న కానిస్టేబుల్ పోస్టుల రాతపరీక్ష

యానాం: పుదుచ్చేరి పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు రాత పరీక్షను వచ్చే నెల 4న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి ఎం.కన్నన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 13 నుంచి మార్చి 31 వరకూ నిర్వహించిన ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు రాత పరీక్షకు అర్హులన్నారు. అభ్యర్థుల హాల్ టికెట్ల జారీ, పరీక్షా కేంద్రాల తదితర వివరాలను త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.

దస్త్రం కదలదేమి.. చర్యలు తీసుకోరేమి..?

- యానాం కోపరేటివ్ స్టోర్స్‌లో రూ.71 లక్షలు పక్కదోవ
- రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీకి నివేదిక చేరినా చర్యలు శూన్యం
- రూ.5 లక్షలు రికవరీ చేసి చేతులు దులిపేసుకున్న వైనం



యానాం కోపరేటివ్ స్టోర్స్

యానాం: నాలుగు వేల మంది సభ్యులున్న యానాం కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ ద్వారా 2018 నుంచి 2021 వరకూ జరిగిన మద్యం అమ్మకాల్లో రూ.71 లక్షల అవినీతి జరిగిందని ప్రాథమిక విచారణలోనే నిగ్గు తేల్చారు. అయినా పూర్తి స్థాయి విచారణ జరిపించలేదు. ఎవరెవరు ఎంతెంత మేర అవినీతికి పాల్పడ్డారో గుర్తించినా కనీస చర్యలు లేవు. నిందితులు కాలరెగరేసుకుని మరీ తమ విధుల్లో పాల్గొంటున్నారు. ప్రజల సొమ్ము తినేసినా అధికారులు ఏళ్ల తరబడి చోద్యం చూస్తుండడంతో దీంట్లో ఉన్నతాధికారులకు సైతం పాత్ర ఉందనే విమర్శలకు ఆస్కారమిచ్చినట్టైంది.

నిలిచిన నిత్యావసరాల పంపిణీ

1958లో 30 మంది సభ్యులతో ప్రారంభించిన యానాం కోపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌లో కాలక్రమంలో నాలుగు వేల మంది సభ్యులయ్యారు. నిత్యావసరాల పంపిణీతో పాటు అనేక ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేసి పుదుచ్చేరివ్యాప్తంగా 7 సార్లు ఉత్తమ స్టోర్స్ అవార్డును అందుకున్న ఘనత ఉంది. యానాం కోపరేటివ్ స్టోర్స్ ద్వారా గతంలో బియ్యం, పంచదార, కిరోసిన్, పామాయిల్ తదితర నిత్యావసరాలు పంపిణీ చేసేవారు. అయితే ప్రభుత్వం నగదు బదిలీ(డీబీటీ) పద్ధతిని ప్రవేశపెట్టడంతో సరకుల పంపిణీ నిలిపేసి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సొమ్మును జమ చేస్తున్నారు. వందలాది మంది సిబ్బందికి గత రెండేళ్లుగా జీతాలివ్వడం లేదు. అంతేకాదు సంస్థ సుమారు రూ.1.30 కోట్ల మేర నష్టాల్లో కూరుకుపోయింది.

మద్యం అమ్మకాల్లో అవకతవకలు

యానాం కోపరేటివ్ సొసైటీ ద్వారా నడిచే కోపరేటివ్ స్టోర్స్ ద్వారా 2010లో లిక్కర్ అమ్మకాలను ప్రారంభించారు. అయితే 2018 నుంచి 2021 వరకూ జరిగిన రూ.4 కోట్ల మద్యం అమ్మకాల్లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వచ్చాయి. కోపరేటివ్ రీజనల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల బృందం తనిఖీ చేసి రూ.71,29,569 సొమ్ము పక్కదోవ పట్టిందని నిగ్గుతేల్చి పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్‌కు నివేదించారు. దీంట్లో ఐఎంఎఫ్ఎల్ సెక్షన్ ఇన్‌చార్జి రూ.39,13,883, ఏడుగురు సేల్స్‌మెన్‌లు రూ.32,15,686 మేర దుర్వినియోగం చేసినట్లుగా ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు జరిగిన అవకతవకలపై గతంలో పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటి వరకూ వారెవరిపైనా చర్యలు లేకపోవడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. నిందితుల నుంచి రూ.5 లక్షల వరకూ రికవరీ చేసి చేతులు దులిపేసుకోవడం చూస్తుంటే పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ ఉన్నతాధికారుల పాత్రపైనా అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవినీతి నిజమే



2018–2021 వరకూ జరిగిన ఐఎంఎఫ్ఎల్ అమ్మకాల్లో అవకతవకల ఆరోపణలపై పుదుచ్చేరి రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించాం. అవినీతి నిజమని తేలడంతో 44 పేజీల విచారణ నివేదికను తయారుచేసి పంపించాం. ఇప్పటివరకు సిబ్బంది జీతాల నుంచి రూ.5 లక్షలు రికవరీ చేశాం.

– అబ్దుల్ రజాక్, ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్, కోపరేటివ్ శాఖ, యానాం

వేసవి సెలవులను క్రీడా శిక్షణతో గడపండి

అమలాపురం టౌన్: వేసవి సెలవులను క్రీడా శిక్షణతో గడిపేందుకు విద్యార్థులు ఆసక్తి చూపాలని ఎమ్మెల్సీ, జాతీయ బాస్కెట్ బాల్ మాజీ క్రీడాకారుడు కుడుపూడి సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. గోపాల కృష్ణ గోఖలే బాస్కెట్ బాల్ ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు శుక్రవారం సాయంత్రం ప్రారంభించి ప్రసంగించారు. ఈ నెల 5 నుంచి 28 వరకూ అంటే 23 రోజులపాటు నిర్వహించే ఈ ఉచిత బాస్కెట్ బాల్ క్రీడా శిబిరాన్ని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమలాపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ పర్యవేక్షణలో జరిగే ఈ ఉచిత శిబిరంలో నిష్ణాతులైన బాస్కెట్ బాల్ క్రీడా నిపుణులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు.



శిక్షణా శిబిరానికి హాజరైన విద్యార్థులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, అమలాపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంసాని గంగాధర్, జాతీయ క్రీడాకారుడు నడింపల్లి అప్పలరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు కుడుపూడి బుజ్జి, చప్పిడి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శ

అల్లవరం: ఇటీవల గూడాలోని తన నివాసంతో గుండెపోటుతో మృతి చెందిన గూడాల ఎంపీటీసీ సభ్యురాలు జల్లి మరియమ్మ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శుక్రవారం పరామర్శించారు. మరియమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, ఎంపీటీసీ గుబ్బల రంగనాథస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులున్నారు.



మరియమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

వేంకటేశ్వరస్వామికి చందనోత్సవం



చందనోత్సవంలో సతీ సమేత వేంకటేశ్వరస్వామివారు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: స్థానిక ప్రధాన రహదారిలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామికి శుక్రవారం చందనోత్సవం, చక్రస్నానం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ 32వ వార్షికోత్సవాలు గత ఐదు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో పూర్ణాహుతి, చందనోత్సవం, చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా ప్రతిష్ఠించిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే పొన్నాడ సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాపు ఉద్యమ నేతలకు సత్కారాలు

అమలాపురం టౌన్: తుని రైలు దహన కేసును కోర్టు కొట్టేయడంతో అమలాపురానికి చెందిన నాటి కాపు ఉద్యమ నేతలను పలువురు శుక్రవారం కలిసి సత్కరించారు. రాష్ట్ర కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్ కల్వకొలను తాతాజీ, కాపు జేఏసీ నాయకుడు నల్లా పవన్‌కుమార్‌లను వారి వారి ఇళ్లకు వెళ్లి కాపు నాయకులు అభినందించారు.

అన్నమయ్య అష్టోత్తర శత సంకీర్తనార్చన



అన్నమయ్య సంకీర్తనార్చన నిర్వహిస్తున్న కళాకారులు

అమలాపురం టౌన్: అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం భూపయ్య అగ్రహారంలోని సీతారామచంద్రమూర్తి దేవస్థానంలో అన్నమయ్య అష్టోత్తర శత సంకీర్తనార్చన నిర్వహించారు. దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, బాల భక్త సమాజం కార్యదర్శి కొత్తూరి శ్రీనివాస్, ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధుల ఆధ్వర్యంలో సంకీర్తనార్చన కన్నుల పండువగా జరిగింది. కళాకారులు తాతపూడి సౌమ్య లక్ష్మి, పేరి సత్యవాణి, ఆంధ్ర ఉషారాణి శిష్య బృందం తదితరులు సంకీర్తనార్చనలో పాల్గొన్నారు. టీటీడీ హిందూ ధర్మ పరిషత్ రాజమహేంద్రవరం శాఖ సహాయకులు ఓరుగంటి నరసింహయోగి సంకీర్తర్చానకు అతిథిగా హాజరయ్యారు.

అకౌంట్లకు కేవైసీ లింక్ చేయించాలి

యానాం: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ను పొందడానికి తమ బ్యాంక్ అకౌంట్లను కేవైసీ, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)తో లింక్ చేయించాలని ఆదిద్రావిడ యానాం శాఖ ఏడీ ఆర్.కృష్ణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌లు పొందడానికి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయడానికి వీలుగా లింక్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. అనుసంధానం చేయించకపోతే స్కాలర్‌షిప్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తు అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో వైఎస్సార్ కల్యాణమస్తు లబ్ధిదారులకు అర్హత పత్రాల్ని శుక్రవారం సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ, మైనార్టీ, ఈబీసీలలో పేదవారికి వివాహ ప్రోత్సాహానికై ఈ పథకం ప్రవేశపెట్టి అండగా నిలుస్తున్నారన్నారు. తమ గ్రామంలో ముగ్గురు దంపతులకు ఈ పథకం వర్తించిందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కార్యదర్శి దాసరి కృష్ణాజి, పార్టీ నాయకులు కోలా ఏసు, ఉంగరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలసవిల్లిలో అర్హత పత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా

అమలాపురం టౌన్: నాయీ బ్రాహ్మణుల సామాజిక అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ఇటీవల డైరెక్టర్‌గా నియమితులైన కాపవరపు శ్రీదేవి అన్నారు. అమలాపురం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో శుక్రవారం సాయంత్రం ఆమెకు జరిగిన సత్కార సభలో శ్రీదేవి ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీదేవి నియామకంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమలాపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తగా నియమితులైన ఉప్పాడ సుబ్బారావును కూడా ఇదే వేదికపై సత్కరించారు. తొలుత నాయీ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్‌ను భట్నవిల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు కళ్లేపల్లి గోవిందు, కార్యదర్శి ఇసుకపూడి తరుణ్, సంఘం జిల్లా నాయకులు ర్యాలి లోవరాజు, పసుపులేటి రామకృష్ణ, రామేశ్వరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, ధర్మకర్త సుబ్బారావులను సత్కరిస్తున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు

అంబేడ్కర్ దేశానికి ఆదర్శంగా నిలిచారు

ఉప్పలగుప్తం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించి దేశానికి ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక మధురపేట రాంజీనగర్‌లో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయిల్‌లతో కలిసి మంత్రి విశ్వరూప్ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోగలిగామని చెప్పారు. ఎమ్మెల్సీ రవీంద్రబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని చట్ట సభల్లో ప్రజాప్రతినిధులుగా రాణిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనతో మహిళలు సమాజంలో విద్యా, ఉద్యోగం, రాజకీయాల వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, శెట్టిబత్తుల రాజబాబు, డీబీ లోక్, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, పెయ్యిల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

కమ్యూనిటీ హాలు పరిశీలన

మండల కేంద్రంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి కావటంతో త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం కమ్యూనిటీ హాలు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి పీఆర్ ఏఈ వి.రాధాకృష్ణకు పలు సూచనలు చేశారు. అందరికీ అందుబాటులో ఉండేలా వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, కుంచే బాబులు, అయితాబత్తుల ముకుందరావు, ఉందుర్తి అంజలరావు, పెయ్యల రమణ, నిమ్మకాయల కాశీ తదితరులు పాల్గొన్నారు.

మహా చండీ యాగంలో పాల్గొన్న విశ్వరూప్

వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్థానిక పార్వతీ మల్లేశ్వర స్వామి ఆలయంలో జరిగిన మహా చండీ యాగంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పురోహితులు భైరవభట్ల వెంకట సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి పూజ, రుద్రాభిషేకం, చండీ హోమం, అఖండ పూర్ణాహుతి జరిపారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, మోటూరి సత్యంకాపు తదితరులు పాల్గొన్నారు.

కళల గొప్పతనాన్ని తెలియజేయాలి

యానాం: నేటి తరానికి కళల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. భారతీయ దళిత సాహిత్య అకాడమీ(న్యూఢిల్లీ), స్ఫూర్తి సాహితీ సమాఖ్య యానాం సంయుక్త ఆధ్వర్యంలో పుదువై కలైమామణి పురస్కార గ్రహీతలకు స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ మందిరంలో ఆత్మీయ అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ కళల గొప్పతనాన్ని చాటిచెప్పడానికి పుదుచ్చేరి ప్రభుత్వం ఏటా అత్యున్నత పౌర పురస్కారం కలైమామణి అవార్డును అందజేస్తుందన్నారు. ముఖ్యఅతిథి దక్షిణాది రాష్ట్రాల బీడీఎస్ఏ అధ్యక్షుడు పానుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ సమాజంలో వివిధ రంగాల్లో రాణిస్తున్నవారిని గౌరవించుకోవడం మన సంప్రదాయమన్నారు. అనంతరం పురస్కార గ్రహీతలు డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి(సాహిత్యం), కోరుకొండ ప్రసాదరావు(నాటకం), ముమ్మిడి వీరనాగప్రసాద్(చిత్రకళ), గ్రంధి సత్యనారాయణమూర్తి(శిల్పం)ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు, కవి మధునాపంతుల సత్యనారాయణ మూర్తి తదతరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలి

ముమ్మిడివరం: డ్వాక్రా గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు వీఓఏలు పూర్తి బాధ్యత తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ వి.శివ శంకరప్రసాద్ సూచించారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం వీఓఏలతో సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వైఎస్సార్ కల్యాణమస్తు, జగనన్న తోడు, పేదలందరికీ ఇళ్లు, చేయూత, స్త్రీ నిధి రుణాల ప్రగతిపై సమీక్షించారు. సమీక్షా సమావేశంలో స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్లు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి వేడుకలు

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పోలమ్మ చెరువు గట్టు బుద్ధపార్కులో బీమ బౌద్ధ పీఠం మరియు అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని 2567వ జయంత్యుత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధిస్టు జెండాను ఉపాసిక ఎం.ఆశీర్వాదం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాశి వెంకటాచార్య, జనిపెల్ల సత్యనారాయణ, దుక్కిపాటి సూర్యనారాయణ, కాశి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాళ్లరేవు: తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.అనుపమ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. స్థానిక కార్యాలయంలోని బాలయోగి సమావేశ మందిరంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి వైస్ ఎంపీపీలు, మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవుతారన్నారు.

సమాజంలో నర్సులది కీలకపాత్ర

యానాం: ఆరోగ్యవంత సమాజ రూపకల్పనలో నర్సులు కీలకపాత్ర వహిస్తున్నారని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఆర్‌కే సమావేశ మందిరంలో స్థానిక మదర్‌థెరిస్సా పోస్టు గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ప్రథమ సంవత్సరం నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ల్యాంప్ లైటింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి

తాళ్లరేవు: తాళ్లరేవుమాధవరాయునిపేటలో మందపల్లి వీరమ్మ(65) అనే వృద్ధురాలు విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శుక్రవారం ఉదయం తన ఇంటి ప్రాంగణంలోని బోరింగ్ కొడుతుండగా విద్యుత్ మోటార్ వైరు తగలడంతో షాక్‌కు గురై మరణించింది. వీరమ్మ మృతికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు అందలేదని వీఆర్వో ఎస్.వీరబాబు తెలిపారు.

అధికారుల చొరవతో తొలిగిన ముంపు

తాళ్లరేవు: మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షపాతం కారణంగా గాడిమొగ పంచాయతీ చినవలసల లేఅవుట్ ముంపుకు గురైంది. దీంతో డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, గాడిమొగ పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణలు చినవలసల లేఅవుట్‌ను శుక్రవారం పరిశీలించారు. లేఅవుట్‌కు చేర్చి ఉన్న డ్రెయిన్‌లో పూడికలు తీయించి రహదారికి గండి కొట్టి ముంపు నీటి సమస్య తొలిగించారు.

నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి

తాళ్లరేవు: భారీ వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని పోలేకుర్రు, జార్జిపేట, లచ్చిపాలెం తదితర పంచాయతీల్లో వ్యవసాయ భూములను రాజబాబు పరిశీలించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

ఐ.పోలవరం: ఐ.పోలవరం ఎంపీడీవోగా బి.రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా డ్వామా పీడీ కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

అమలాపురం రూరల్: స్థానిక పాత బండారులంక బిళ్ళ వారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి తీర్థ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు లక్ష్మీదేవి డాలరు, గాజులు, స్వామి వారి ఫొటో, గోవింద నామాలు, పూల మొక్క, పూజా సామగ్రి ఉచితంగా అందించారు. అనంతరం అన్నసమారాధన చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన గరుత్మంతుని వాహనంపై స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.

స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి

ఐ.పోలవరం: ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. ఐ.పోలవరం మండలం కొమరగిరిలో జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.72 లక్షలతో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకు, రూ.53 లక్షలతో నిర్మించిన వాటర్ సంపును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్తా మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండల కన్వీనర్ పిన్నమరాజు శ్రీనురాజు, ఢిల్లీ నారాయణ, ధూళిపుడి చక్రం తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

అమలాపురం రూరల్: ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా కిమ్స్ హాస్పటల్‌లో చేతుల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, సీఈవో బాలాజీ, నర్సింగ్ పారామెడికల్ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ వైద్య సేవలు అందించే సమయంలో చేతుల పరిశుభ్రత చాలా ప్రాధాన్యత వహిస్తుందన్నారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో కిమ్స్ ఇన్‌స్పెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ శ్రీలలిత పలు సూచనలు చేశారు.



చేతుల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు